


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



-79 -

## నా.. ఎడారి పయనం

1998 జూన్ 11న తిరుపతి నుండి రైల్లో ముంబాయికి పయనం. కువైట్ కి వెళ్ళే విమానం ముంబాయిలో వుందని మా ఏజెంట్ చెప్పాడు. అక్కడ కువైట్ లో పేరొందిన న్యూరోసర్జన్ ఇంట్లో వరుసకు పిన్ని అయే ఆవిడ పనిచేస్తోంది. నాకేమో కువైట్ కి వెళ్ళాలనే ఆసక్తి. పిజి డిసిఎ కంప్యూటర్ కోర్సులు చేసాను పిన్నీ నాకు ఉద్యోగం చూడు అని జాబులు రాసేదాన్ని.

ఆమె "చూడు లలితమ్మా ఇక్కడ ఈ కువైట్ లో నాకు బయట ప్రపంచం తెలియదు. నేను పెద్దగా చదువుకోలేదు కాబట్టి నీకు ఉద్యోగం చూడటం నా వల్ల కాదు. మా బాబా తమ్ముడు కొత్తగా పెళ్ళి చేసుకున్నాడు. ఇంట్లో మామాకు తోడుగా వుండటానికి ఒక మనిషిని చూడమంటున్నాడు. నువు వస్తానంటే వీసా పంపిస్తాను. నువు ఇక్కడికి వచ్చాక మా అక్క కూతురు బాగా చదువుకుంది బయట ఉద్యోగం ఇప్పించదని నేను వాళ్ళని ప్రాధేయపడి అడుగుతాను. ఒకసారి నువు ఏదో ఒక వీసా పైన ఇక్కడికి వచ్చేసావంటే తరువాత బాబా దగ్గర రిలీజ్ అడిగి తీసుకుని బయట ఉద్యోగం చూసుకోవచ్చు" అని సలహా ఇచ్చింది.

ఎప్పుడెప్పుడు ఫ్లైట్ ఎక్కుదామా కువైట్ కి వెళదామా అని సరదా పడుతున్న నేను "అలాగే పిన్నీ నువ్వు ముందు ఏదో ఒక వీసా పంపించు అక్కడికి వచ్చాక జాబ్ చూసుకుందాం" అన్నాను.

వెంటనే ఆమె నాకు వీసాతో పాటూ ఫ్లైట్ టికెట్ పంపించడం నేను మద్రాస్ లో మెడికల్ చేయించుకుని ముంబాయికి ప్రయాణమవ్వడం జరిగి పోయాయి. తిరుపతినుండి ముంబై కి రైల్లో ఒక రాత్రి ఒక పగలు ప్రయాణం. నాతో పాటూ మా ఊరి ఏజెంటూ మా పిన్ని కొడుకు శంకరన్న బయలుదేరి వచ్చారు.

మరుసటి రోజు మధ్యాహ్నం మేము ప్రయాణించే రైలు సిగ్నల్ కోసం ఒక చోట ఆగింది. నేను నిద్రలో వున్నదాన్ని మెలకవ వచ్చి లేచి రైలు కిటికీలోనుండి బయటికి చూసాను. బయట వర్షం జోరుగా కురుస్తోంది.

ఆ ప్రదేశమంతా పచ్చటి కొండలతో చెట్లతో అద్భుతంగా కనిపించింది. కళ్ళకు కనువిందు చేసే ఆ ప్రకృతి రమణీయత మనసును పరవశింపజేసింది. ఇది ఏ ఊరు అని పక్కనే వున్న వాళ్ళని అడిగాను.

"రైలు ప్రస్తుతం పూనే దగ్గర వున్న ఖండాలా లో ఆగివుంది" అని చెప్పారు వాళ్ళు.

ఓ ఖండాలానా ఇది. ఎంత అందంగా వుందో. కువైట్ నుండి తిరిగి వచ్చాక తప్పకుండా ఈ ఖండాలాను చూడాలి అని మనసులో నిశ్చయించుకున్నాను నేను. తరువాత కొన్ని గంటలకే రైలు ముంబాయికి చేరుకుంది. నా మనసుమాత్రం ప్రేమికుని చుట్టూ గింగిరాలు తిరిగినట్లు ఖండాలా సౌందర్యారాధనలోనే మునిగిపోయి అక్కడే తిరుగుతోంది. ఏండ్లు గడిచినా మదిలో ముద్రించుకుపోయిన ఆ అందమైన దృశ్యాన్ని నేను మరువలేకపోయాను. ముంబైలో వర్ల అనే ఏరియాలో ఏజంట్ ఆఫీసు వుంది. అక్కడికి వెళ్ళి అక్కడవున్న పెద్ద ఏజంట్ ని కలిసి ఫ్లైట్ వివరాలను అడిగాము.

అతను టికెట్ ను చూసి "అయ్యో ఈ టికట్ మద్రాసు నుండి చేసారు. ఇక్కడ నుండి కాదు" అని చెప్పాడు. మేము కొంచెం టెన్షన్ పడి "ఇప్పుడు ఏం చెయ్యాలి?" అని అడిగాము.

అతను "మీరు కువైట్ కి ఫోన్ చేసి ఈ టికట్ బొంబాయికి మార్పించండి" అని చెప్పాడు.

వెంటనే ఫోన్ చేసి మా పిన్నికి విషయం చెప్పాము.

ఆమె వెంటనే వాళ్ళ సేటుతో మాట్లాడి "ఇక్కడ గురువారం శుక్రవారం రెండ్రోజులు శెలవులు కాబట్టి టికట్ ఆఫీసులు లేవు. మీరు అక్కడే బొంబాయి లో వుండండి. మేము శనివారం కొత్త టికెట్ చేసి బొంబాయికి పంపిస్తాము" అని చెప్పింది.

మేము కాస్త స్థిమితపడ్డాము. అక్కడి ఏజంట్ మమ్మల్ని పైన వున్న గదిలోకి వెళ్ళి అందరినీ సర్దుకొని వుండమన్నాడు.

అక్కడ వున్న ఒక గది సీలింగ్ కి మధ్యలో చెక్కలు పెట్టి పైన మరో గదిగా తయారు చేసారు. బొంబాయిలో అంతేనట. అక్కడే నీళ్ళ పంపు వుంటే ఓ మూల కాస్త అడ్డు పెట్టుకుని ఆడాళ్ళు స్నానాలు చేస్తున్నారు. మగాళ్ళు కొందరు గురక తీసి నిద్ర పోతున్నారు.

కడప వైపునుండి వచ్చిన వాళ్ళు కొందరు వక్కాకు నములుతూ పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. ఒక మూల చిన్న కిరోసిన్ స్టవ్ పై ఇద్దరు ఆడవాళ్ళు అన్నం వండుతున్నారు. ఊరినుండి వెంట తెచ్చుకున్న పచ్చళ్ళు, పొడులు వేసుకుని తినేస్తూ వాళ్ళు అలా కాలం గడిపేస్తున్నారట.

బొంబాయినీ, కువైట్ నీ ఎంతో అందంగా ఊహించుకున్న నాకు అదంతా చూసేసరికి భయమేసింది. ఆ మనుషులు ఆ వాతావరణం భయంకరంగా మురికిగా నాక్కనిపించాయి.

అక్కడ దాదాపూ ఇరవై మంది దాకా వున్నారు. అందరూ అక్కడే వరసగా ఒకరి పక్కన మరొకరు పడుకుంటారట. బాత్ రూములు కింద మరోవైపు వున్నాయి. పొద్దున్నే క్యూలో వెళ్ళి అవి వాడుకోవాలిట. ఇక గత్యంతరం లేని పరిస్థితి.

రెండ్రోజులు ఇక్కడ ఎలా వుండాలా అని భయపడుతూ నేను అక్కడ ఒక స్టూలు వుంటే దాని మీద కూర్చున్నాను. ఈ టికట్ కరక్ట్ గా వుంటే రేపుదయాన్నే ఫ్లైట్ ఎక్కేసి కువైట్ వెళ్ళి పోయేదాన్ని కదా అనుకుంటూ అక్కడున్న వాళ్ళు పలకరిస్తే వాళ్ళతో మాటల్లో పడ్డాను. వాళ్ళలో కొందరు వీసాల గడువు ముగిసిపోయి కొత్త వీసా కోసం ఎదురు చూస్తున్నారు. మరి కొందరు టికట్లు లేక, ఏజంటుకు కట్టేందుకు డబ్బులేక, మెడికల్ ఫెయిల్ అవడం వల్ల వెళ్ళడం కుదరక, అలా అక్కడే ఆ మురికి కూపంలో పడి కొన్నినెలలుగా కాలం గడుపుతున్నారు.

వాళ్ళ ధోరణి చూస్తే అక్కడి వాతావరణానికి బాగా అలవాటు పడినట్లున్నారు.

వారిలో సుబ్బమ్మ అనే ఒకావిడ కడప నుండి వచ్చింది. మెడికల్ ఫెయిల్ అవడంతో ఏజంటుకు డబ్బు కట్టి మరలా పాస్ చేయించుకుని వెళ్ళాలని ప్రయత్నిస్తూ దాదాపూ రెండు నెలలుగా అక్కడే వుంటోంది.

నోటినిండా ఎర్రగా వక్కాకు నములుతూ ఎంగిలి మూలకు తుపుక్కున ఊస్తూ ఆమె వివరాలన్నీ చెప్పుకొచ్చింది.

ఇంకా ఇద్దరు ఆడవాళ్ళు నా చుట్టూ చేరి నా వివరాలు అడగడం మొదలు పెట్టారు. పిచ్చాపాటీ మాట్లాడుతుండగా మా శంకరన్న వచ్చి "అమ్మా పోదాం పద" అన్నాడు.

"ఎక్కడికి అన్నా?" అన్నాను.

"బయట రూం తీసుకుందాము. ఇక్కడ ఎలా వుంటాం?" అన్నాడు.

ఆ మాట వినడంతోనే నాకు ప్రాణం లేచి వచ్చింది. బ్యాగు పట్టుకుని వెంటనే బయల్దేరాను. మా ఊరి ఏజంటుకు మా అన్నకు ఒక రూము, నాకు ఒక రూము తీసుకున్నాము. ఆ రాత్రి అన్నం తెప్పించుకుని తినేసాము.

మరుసటి రోజు బస్ లో బొంబాయి చూడటానికి బయల్దేరి వెళ్ళాము. బీచ్, హాజి ఆలీ దర్గా లాంటి కొన్ని ముఖ్యమైన ప్రదేశాలు చూసాము. సాయంత్రానికి తిరిగి ఏజంటును కలవాలని ఆఫీస్ కి వచ్చాము. ఏజంటు మమ్మల్ని చూడగానే సంతోషం గా "టికట్ ఫాక్స్ లో వచ్చేసింది. రేపుదయమే మీ విమానం" అని చెప్పాడు.

మేము వెంటనే మా పిన్ని కి ఫోన్ చేసాము.

ఆమె "నువ్వు బొంబాయిలో మూడ్రోజులు అగచాట్లు పడటం ఇష్టం లేక శెలవులైనా సరే బాబాను ఎయిర్ పోర్టుకు పంపించి అర్జంటుగా టికెట్ చేయించాను. రేపే నీ విమానం, ఎక్కి తొందరగా వచ్చెయ్. నీ కోసం ఎదురు చూస్తున్నా" అంది.

రేపే ఫ్లైట్ అనగానే నాక్కూడా ఉత్సాహంగా అనిపించింది. దిగులు వీడింది.

1998 జూన్ 16 వ తేదీన పొద్దున్నే ఆరున్నరకు వుంది. బొంబాయి నుండి కువైట్ వెళ్ళే విమానం. తెల్లారక ముందే ఎయిర్పోర్టుకు చేరుకున్నాం. అదే మొదటి సారి ఎయిర్ పోర్ట్ ను చూడటం. ఆశ్చర్యంగా కళ్ళప్పగించి చూసాను. నన్ను లోపలికి పంపించి మా అన్న వాళ్ళు బయట నిలబడి పోయారు.

వీడ్కోలు చెబుతుంటే కంట్లో తడి. పరాయి దేశానికి పయనం. అక్కడ పరిస్థితులు ఎలా వుంటాయో ఏమో. తిరిగి మన గడ్డపై కాలు మోపడానికి ఎన్నేళ్ళు పడుతుందో. మళ్ళీ తిరిగి వస్తానో రానో. ఏది ఏమైనా రెండేళ్ళు మాత్రమే వుండి తిరిగి వచ్చెయ్యాలి. ఎందుకో ఒక్కసారి వంగి నేలను స్పర్శించి కళ్ళకద్దుకోవాలనిపించింది.

నా తల్లీ భారతీ నీకు వీడ్కోలు. మళ్ళీ ఎప్పుడో. ప్రాణంతో తిరిగి వస్తే కలుద్దాం. ఇలా అనుకుంటూ ఆలోచిస్తూ కన్నీళ్ళు పొంగుకొస్తుంటే పాస్పోర్టు టికెట్టు చేతబట్టుకుని విమానమెక్కాను.

కోపమొస్తే అక్కడి సేట్లు కొడతారట. బూటు కాలితో తంతారట. ఇంకా ఏదైనా తప్పు చేస్తే చంపి శవాన్ని ఎడారిలో కాకులకూ గద్దలకూ వేస్తారట. ఒక్కసారిగా వళ్ళు జలదరించింది భయంతో. విదేశం మీద మోజుతో కువైట్ వెళ్ళాలనుకున్నాను కానీ ఇప్పుడు కాస్త కంగారుగానే వుంది.

కిటికీ పక్కనే సీటు. బయట రన్ వే లు పక్షులను పరదేశాలకు చేర్చే ఆకాశదారుల్లా కనబడుతున్నాయి. విమానం అరేబియా సముద్రంలో పడిపోదు కదా. భయంతో కూడిన సందేహం.

పక్కనే వున్న ఒకామె "ఏం పేరు నీది?" అంటూ పలకరించింది.

తెలుగును వినడంతో పన్నీరు ఎదలో చిలకరించినట్లయింది. "లలిత" అన్నాను.

"మొదటిసారా రావడం?"

"అవును" తల నిలువుకు ఊగిస్తూ చెప్పాను.

"భయపడకు. నేనున్నా కదా." కళ్ళతోనే భరోసా ఇచ్చింది.

నవ్వాను.

విమానం గాల్లోకి లేచింది. అంతవరకూ పుస్తకాల్లో చదవడమే విమానం టేకాఫ్ గురించి. కింద ఇండ్లు, వీధులు బొమ్మల్లా గీతల్లా కనబడుతుంటే వింతగా అనిపించింది. విమానం ఇంకా పైకి ఎగిరి మేఘాల్లోకి చేరింది.

అప్పుడే తూరుపు ఆకాశాన ఉదయించే సూర్యుడు మేఘాలతో దోబూచులాడుతూ బంగారు కిరణాలతో భూపాళ రాగం పాడుతున్నాడు. ఆహా మేఘాల్లో ఎగరడం. గాల్లో తేలడం ఎంత బాగుంది.

ఇంతలో ఎయిర్ హోస్టెస్ వచ్చి చాకొలేట్లు ఇచ్చి వెళ్ళింది.తరువాత జ్యూస్ ఇచ్చింది.

నా పక్కనున్న ఆవిడ "ఎంత అడిగినా ఇస్తారు. సిగ్గుపడకుండా తాగు" అని నా చెవిలో గుసగుసగా చెప్పింది. సిగ్గుపడ్డాను.

తరువాత చిన్న అల్యూమినియం బాక్స్ లో వున్న ఫుడ్ ని సర్వ్ చేసారు.

"కంచం నిండా రెండు ముద్దల రాగిసంగటి తినే మనకు ఈ పిడికెడు తిండిసరిపోతుందా" దగ్గరికి వంగి మళ్ళీ గుసగుసలాడింది.

చిన్నగా నవ్వాను.

"సరిపోకపోతే అడుగు. ఇంకొకటి ఇస్తారు" చెప్పింది.

మళ్ళీ అడిగే అవసరం నాకు రాలేదు.

ఆమె మాత్రం మరొకటి తీసుకుని తృప్తిగా తిని నీళ్ళు తాగింది. మాటల్లో ఆమె పేరు మంగ అని తెలిసింది. సీటు వెనక వున్న టివి ని ఆన్ చేసింది. కాసేపు టివి చూసాము. బొంబాయి నుండి డైరెక్టు విమానం కాబట్టి కువైట్ కు నాలుగున్నర గంటల ప్రయాణమే.

చాలా రోజులనుండీ సరిగ్గా నిద్ర పోలేదేమో తెలియకనే కళ్ళు మూతలు పడ్డాయి. బిగ్గరగా అనౌన్సుమెంట్ వినబడగానే కళ్ళు తెరిచాను. విమానం కువైట్ లో దిగుతోంది కాబట్టి సీట్ బెల్ట్ కట్టుకో అంటున్నారు.

కాసేపట్లో చిన్న జర్క్ తో విమానం కువైట్ నేలపైన దిగింది. హోరుమనే శబ్దంతో కాసేపు రన్ వే పైన పరిగెత్తి ఆగింది. హమ్మయ్య అనుకున్నాను.

విమానం దిగి పరదేశంలో కాలు మోపాను. ఒక్కసారిగా ఎడారి గాలులు వేడిగా చుట్టుముట్టాయి. ఆ కట్టడాలు, వాతావరణం, ఎడారి నేలను చూస్తుంటే మన భారత దేశానికి ఈ దేశానికి చాలా తేడా వుందనిపించింది.

ఇమ్మిగ్రేషన్ అయ్యాక సెక్యూరిటీ వాళ్ళు మమ్మల్ని అక్కడే ఆపేసారు. బయట నా వీసా ఇంకా సబ్మిట్ చెయ్యలేదట.

ఎయిర్ పోర్ట్ లోపలనుండి మా పిన్నికి ఫోన్ చెయ్యడానికి ప్రయత్నించాను కానీ కాల్ వెళ్ళలేదు. నాతోపాటూ ఐదారుమంది వున్నారు.

వీసా పైన స్టాంపింగ్ వెయ్యాలంటే మా బాబా వచ్చి బయట కౌంటర్ లో వీసాను ఇచ్చి లోపలికి పంపితే గానీ మమ్మల్ని బయటికి పంపరట. మరి మాతోపాటూ వచ్చిన చాలా మంది బయటికి వెళ్ళి పోయారు కదా అని ప్రశ్నించాను.

"వాళ్ళు రెండోసారి సెలవులకు వచ్చిన వాళ్ళు. మీరు మొదటిసారి రావడం కదా" అని బదులు చెప్పారు.

మా సంభాషణంతా వచ్చీ రాని ఇంగ్లీష్ లోనే నడిచింది. అప్పటికి నాకు ఇంగ్లీష్ మాట్లాడటం అంతగా అలవడలేదు. అంతకుముందు మా ఊరిలో ఆ అవసరమెప్పుడూ నాకు కలగలేదు.

వాళ్ళంతా అరబ్బీలో మాట్లాడుతుంటే కంగాళీగా అనిపించింది. ఈ అరబ్బీభాష నేర్చుకోవడానికి ఎన్నిరోజులు పడుతుందో అనుకున్నాను. అంతా కొత్తగా వుంది. దాదాపూ రెండుగంటల తరువాత పాస్పోర్టుపై స్టాంప్ వేసి "రూహె" (పో) అన్నారు.

బయటకి రాగానే మా పిన్ని ఎదురొచ్చి "వెల్కం టు కువైట్" అని షేక్ హాండ్ ఇచ్చింది. పక్కనే వున్న మా బాబా సులేమాన్ ను నాకు పరిచయం చేసింది. చల్లగా చందమామలా వున్న మా బాబా చక్కటి చిరునవ్వు నవ్వాడు.

నేను ఊహించుకున్నట్లుగా ఆయన క్రూరంగా కనబడ లేదు. మంచివాడే అనిపించింది.

అరబిక్ డ్రస్ లో తెల్లగా వున్న మా బాబా హిందీ యాక్టర్ అమీర్ ఖాన్ లా వున్నాడనిపించింది. పార్కింగ్ లోకొచ్చి కార్లో కూర్చున్నాం.

"లలితా అరబిక్ అంతరస్తాన్" అనింది మా పిన్ని వచ్చీ రాని ఇంగ్లీష్ లో.

ఏమడుగుతోందో నాకర్థం కాక తెల్ల ముఖం వేసాను.

"ఇక్కడ పిలిప్పీన్ వాళ్ళు అదే అంటారు నాకలాగే ఇంగ్లీష్ నేర్పించారు" అనింది.

బాబా నవ్వి "అంతరస్తాన్ కాదు అండర్ స్టాండ్" అన్నాడు.

"ఓహో అదా" అని నవ్వాను నేను.

"బాబా లలితాకు ఇంగ్లీష్ బాగా వచ్చు. తను కంప్యూటర్ చదువు చదివింది" అని అరబ్బీలో బాబాకు చెప్పింది మా పిన్ని.

"ఐ సీ. వెరీ గుడ్" అన్నాడు బాబా.

"వీళ్ళకు ఇంగ్లీష్ వచ్చిన వాళ్ళంటే చాలా ఇష్టం. మీ బాబా చాలా మంచివాడు. అమాయకుడు. నన్ను కూడా బాబా అంటూ మర్యాదగా పలకరించి మాట్లాడతాడు. ఇలాంటి వాళ్ళు దొరకడం నీ అదృష్టమే. ఒక ఆర్నెల్లు వీళ్ళతో పని చేసావంటే తరువాత చిన్నగా విషయం చెప్పి బయటకి రిలీజ్ ఇమ్మని అడుగుదాం. అప్పుడు నువ్వు నీ చదువుకు తగిన ఉద్యోగం బయట ఆఫీస్ లో చూసుకోచ్చు." నాతో చెప్పింది మా పిన్ని.

దారంతా కనబడిన ఖర్జూరపు చెట్లు ఇది ఎడారి నేల అని గుర్తు చేస్తున్నాయి. నేలంతా ఇసుకతో బంగారు వర్ణంలో వుంది. అందరం నవ్వుకుంటూ మాట్లాడుకుంటూ మా పిన్ని వాళ్ళ ఇల్లు చేరాం.

"బాబా లలితా నువ్వు ఇంటిమీద నీ బెంగ తీరేంతవరకు ఇక్కడే మీ పిన్ని దగ్గర పది రోజులు వుండు" అన్నాడు మా బాబా.

ఆ మాట వింటూనే నాకు సంతోషం కలిగింది. ఆ పది రోజులూ మా పిన్ని అక్కడి పద్ధతులు, వాళ్ళ అలవాట్లు, ఆహారం, ఆహార్యం లాంటివన్నీ వివరించింది.

అక్కడే అదే ఇంట్లో మా పెద్దమ్మ కొడుకు కూడా డ్రైవర్ గా వుండటంతో నాకు ఇంటిమీద బెంగ లేకుండా హాయిగా గడిపాను.

మా పిన్ని వాళ్ళ బాబా, మామా ఇద్దరూ డాక్టర్లే. మామా రష్యా దేశస్తురాలు. వాళ్ళది ప్రేమ వివాహం. ఇద్దరు అమ్మాయిలు. పెద్దది ఫాతిమా. చిన్నది అశీల్. మొదటిసారి కళ్ళు విప్పార్చి అరబిక్ అందగత్తెలను చూసాను. వీళ్ళు అందరి అరబిక్ అమ్మాయిల్లా బురఖాలు వేసుకోరు. తలకు హిజాబ్ లు కట్టుకోరు. వాళ్ళమ్మ రష్యన్ కాబట్టి ఫారిన్ కల్చర్ నే అనుసరిస్తున్నారు.

ఇద్దరమ్మాయిలూ జాజిపువ్వుల్లా వున్నారు. తాకితే పాలుగారే దేహం. గులాబీ పెదాలు. నల్లటి కురులు. తీర్చిదిద్దినట్లున్న కనుబొమలు.

వీళ్ళ అందం ముందు ప్రబంధ నాయికలు కూడా తేలిపోతారేమో అనిపించింది. వాళ్ళు కూడా నాతో నవ్వుతూ స్నేహంగానే మాట్లాడారు. నేను క్షేమంగా చేరుకున్నట్లు ఇంటికి ఫోన్ చేసి చెప్పాను.

తరువాత మా బాబా వాళ్ళింటికి తీసుకొచ్చాడు. నాకో గది ఇచ్చారు. బట్టలు, చెప్పులు, సబ్బులు, షాంపూలు, శానిటరీ పాడ్స్ లాంటివన్నీ కొని పెట్టారు. మా మేడం ఇరానీ తండ్రికి కువైట్ తల్లికి పుట్టిన అందగత్తె. ఆమె పేరు అబ్రార్. అప్పటికే నాలుగు నెలల గర్భవతి. ఎప్పుడూ గదిలో పడుకోని నిద్రపోతుండేది.

ఎప్పుడు ఆఫీస్ కి వెళుతుందో అర్థమయేది కాదు. బాబా మాత్రం పొద్దున్నే ఏడు గంటలకు వెళ్ళిపోయేవాడు. ఉదయం వెళ్ళేటప్పుడు సాండ్విచ్ మాత్రం చేసివ్వాలి. అది కూడా ఎలా చేయాలో బాబానే నాకు నేర్పించాడు. నేను కూడా అదే చేసుకుని తినేదాన్ని. కాస్త అన్నం వండుకుని పప్పో, పచ్చడో చేసుకునే దాన్ని. మేడం మధ్యాహ్నం లేచేది. కారేసుకుని వెళ్ళిపోయేది. మరలా ఎప్పుడో వచ్చేవాళ్ళు.

నేను ఫ్రిడ్జ్ లో వున్న ఆపిల్స్, జూస్ లూ తాగి కాలం గడిపేదాన్ని. నాకు కొన్నిరోజులు ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఇల్లు చిన్నదే. దుమ్ము దులిపి ఇల్లు ఊడ్చి తడిబట్ట పెట్టేదాన్ని. నా గదిలో కూర్చుని బుక్స్ చదువుకునే దాన్ని. అప్పుడే ఆంధ్రభూమి, మయూరి లాంటి పత్రికలు తెప్పించుకుని చదవడం మొదలయ్యింది.

ఎందుకు రాయకూడదు అనిపించి కలాన్ని కదిలించి కవితలు రాసి ఆంధ్ర భూమి కోయిలా కూయిలా కు పంపించాను. వరుసగా అచ్చవడం సంతోషాన్ని కలిగించింది. రోజూ అభిమానులనుండి బోలెడు ఉత్తరాలు వచ్చేవి. బయట వున్న బాక్స్ లో పడేసి వెళ్ళేవాడు పోస్ట్ మాన్. అవన్నీ చదివి కొన్నిటికి జవాబు రాసేదాన్ని. అప్పుడే ప్రముఖ రచయిత్రి బలభద్రపాత్రుని రమణి గారి సీరియల్ ఆంధ్రభూమిలో చదివి ఉత్తరం రాసాను. ఆమె జవాబిచ్చారు. రమణి గారితో చక్కటి స్నేహానికి అప్పుడే పునాది పడింది.

మా బాబా మామా ఎక్కువగా వాళ్ళ అమ్మ వాళ్ళింట్లోనో బయటో తినేసే వాళ్ళు.కానీ అపుడప్పుడూ మా బాబా చేపలు తెచ్చేవాడు. "నాకు చేపలంటే చాలా ఇష్టం బాబా నా కోసం నువ్వు వండాలి. మామా తినదు మనిద్దరికే" అనేవాడు.

బాబా అంటే అయ్యా అని అర్థం. అలా అనడం గౌరవానికి చిహ్నం. మా బాబా నన్ను బాబా అని పిలిచేవాడు. నాకు అరబిక్ పద్ధతిలో ఫిష్ వండటం మా పిన్ని కాస్త నేర్పించింది. అలాగే ఆ పద్ధతిలో వండేదాన్ని. బాబా నేనూ శుభ్రంగా తినేసేవాళ్ళం. మామా ఫిష్ తినేదికాదు.అంతవరకూ చేపను నేను చేతుల్తో ముట్టుకోలేదు. మొదటిసారి తగిలినప్పుడు జుగుప్సగా అనిపించింది.

ఐదు నెలలు గడిచాక మామా అబ్దుల్లా ను కని నా చేతిలో పెట్టింది."వీడిని నువ్వే చూసుకోవాలి" అన్నారు.



బాల చంద్రుడిలా వాడు ఎంత ముద్దుగా వున్నాడో. వాడి ఆలనా పాలనా నాదయ్యింది. నా దగ్గరే నా గదిలోనే పడుకోవడం కూడా. వాడు నన్ను వదిలి వాళ్ళ అమ్మా నాన్నల దగ్గరికి కూడా వెళ్ళేవాడు కాదు.

నేను కూడా వాడిని కంటికి రెప్పలా చూసుకునే దాన్ని. అలా వాడి ప్రేమలో మునిగి పోయి నా జాబ్ సంగతి మర్చిపోయాను. వాడే లోకమయ్యాడు. నన్నొదిలి ఒక క్షణం కూడా వుండేవాడు కాదు. కనబడకపోతే బెంగ పెట్టుకునే వాడు. వాళ్ళ అమ్మమ్మ వాళ్ళు మా ఇద్దరి అటాచ్ మెంట్ కి ఆశ్చర్యపోయేవారు. అలా అబ్బూదిని పెంచిన తల్లినయ్యాను.



నన్ను మా బాబా అందరికీ "మా చెల్లి లలిత" అని పరిచయం చేసేవాడు. ఏమేం కావాలో అడిగి కొనిపెట్టేవాళ్ళు. అబ్బూది నాలుగేళ్ళ పిల్లాడయ్యాడు.

మా బాబా అంబాసిడర్. ఆయన విదేశీ రాయబార కార్యాలయంలో పని కాబట్టి శ్రీలంక ఎంబసీకి బదిలీ అయింది.

ఐదేళ్ళు శ్రీలంకలో వుండాలి. బాబా ముందుగా వెళ్ళిపోయాడు. మేము కూడా శ్రీలంక వెళ్ళి పది రోజులు వుండి అన్నీ చూసి వచ్చాము. అలరించే పచ్చని ప్రకృతితో శ్రీలంక బావుంది. ఈ లోపల మామాకు బాబాకు ఏవో గొడవలు మొదలయ్యాయి. ఇద్దరూ విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. మామా వాళ్ళ అమ్మ వాళ్ళింటికి వెళ్ళిపోయింది.

బాబా నన్ను "శ్రీలంక వస్తావా లేక బయట పని చూసుకుంటావా?" అని అడిగాడు.

అప్పుడు కళ్ళు తెరిచాను నేను. అంతవరకూ చిన్ని అబ్బాదిని చూసుకుంటూ వాడి ఆట పాటలతో నా ఉద్యోగం సంగతే మర్చేపోయాను. అప్పటికే నాలుగేళ్ళు గడిచిపోయాయి. వెంటనే నేను "బయట జాబ్ చూసుకుంటాను బాబా" అన్నాను.

ఇక తెలిసిన ఫ్రెండ్స్ ద్వారా బయట ఉద్యోగం కోసం ప్రయత్నించాను. అలా 2002 సెప్టంబర్ లో మారియట్ హోటల్లో ఇంటర్వ్యూ కు వెళ్ళాను. వాళ్ళు మరుసటి రోజే వచ్చి జాయిన్ అవమన్నారు. అక్కడ పద్దెనిమిదేళ్ళు ఫైవ్ స్టార్ హోటల్లో ఉద్యోగం చేయడం జరిగింది. మొదట రెండేళ్ళు మాత్రమే కువైట్ లో వుంటే చాలు అనుకున్న దాన్ని ఇరవై రెండేళ్ళు ఎడారి దేశమైన కువైట్ లో జీవిత ప్రస్థానాన్ని కొనసాగించడం, సగం పైగా జీవితాన్ని అక్కడే ఎడారిలో గడపడం, ఎన్నో అనుభవాలను అనుభూతులను ప్రోది చేసుకోవడం జరిగింది.

ఇక ఇప్పుడు ఈ కరోనా వచ్చి ప్రపంచం మీద పడ్డాక ఆ పరిస్థితుల ప్రభావం వలన సంవత్సరం ముందు నేను ఇండియాకు వచ్చేసాను. గల్ఫ్ కి విమాన సర్వీసులు మొదలయితే తప్పక మరలా వెళ్ళాలి.

అన్నేళ్ళు నాతో గడిపి నా ప్రేమను రుచి చూసిన ఆ ఎడారి దేశం నన్ను మరిచిపోవడంలేదు. మరోసారి నన్ను రా రమ్మని పిలుస్తోంది. ఇరవై రెండేళ్ళ ఎడారి జీవితప్రస్థానంలో నా గుండెల్లో జ్ఞాపకాలై చేరిన ఒయాసిస్సులెన్నో, ఎండమావులెన్నో.

జీవితం దినార్ల వేటలో ఎడారి గాచిన వెన్నెలయిందా. ఏమో మరి? అన్నిటికీ ఆ అరేబియా సముద్రమే సాక్షి.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments